క్లుప్తంగా

పదవ తరగతి విద్యార్థులకు ఉచిత ప్రయాణం
తెనాలి ఆర్టీసీ డీఎం రాజశేఖర్



తెనాలిఅర్బన్: పదో తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణ సౌకర్యం ప్రభుత్వం కల్పించిందని తెనాలి ఆర్టీసీ డిపో మేనేజర్ రాజశేఖర్ శుక్రవారం తెలిపారు. ఏప్రిల్ 3 నుంచి 18వ తేదీ వరకు పరీక్షలు జరగనున్నాయన్నారు. ఆ సమయంలో అన్ని పల్లె వెలుగు బస్సుల్లో పరీక్ష కేంద్రానికి వెళ్లే వెసులు బాటును కల్పించినట్లు చెప్పారు. డ్రైవర్లు, కండక్టర్లు ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని విద్యార్థులు టిక్కెట్లు తీసుకోవాలని ఇబ్బంది పెట్టకుండా వారి గమ్యస్థానానికి చేర్చాలని స్పష్టం చేశారు. విద్యార్థులను ఇబ్బంది పెడితే చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలి



కొల్లిపర: ప్రతి ఒక్కరు తమ గృహాలు, పరిసర ప్రాంతాల్లో మురుగు నీరు నిల్వ లేకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని, తద్వారా దోమల ఉధృతిని అరికట్టవచ్చని తెనాలి ఇన్చార్జి మలేరియా అధికారి వంగల పున్నారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం డ్రైడే కార్యక్రమంలో భాగంగా మున్నంగి గ్రామంలో ఎబేట్ మందును మురుగు నీటిలో సిబ్బందితో పిచికారి చేయించారు. గ్రామంలో మురుగు నీరు నిల్వ లేకుండా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి అందెబాల చంద్రమౌళి, ఎంపీహెచ్ఓ వంగర బుజ్జిబాబు, ఏఎన్ఎం ఎం.పులి కుసుమ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

కళాకారుడు నాగేశ్వరరావుకు సన్మానం



తెనాలిఅర్బన్: నందమూరి తారక రామారావు శత జయంతి ఉత్సవాల్లో భాగంగా పెమ్మసాని థియేటర్లో శుక్రవారం కేడీ నంబర్ 1 చిత్రాన్ని ఉచితంగా ప్రదర్శించారు. అనంతరం పౌరాణిక నాటక కళాకారుడు దానబోయిన నాగేశ్వరరావును ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో దేవబత్తుని ఉమా మహేశ్వరరావు, తుమ్మల సత్యనారాయణ, వైఎల్.చౌదరి, శరణ్ వెంకటేశ్వర ప్రసాద్, సీహెచ్ శ్రీనివాసరావు, పెమ్మసాని పోతురాజు, డాక్టర్ అయినాల మల్లేశ్వరరావు, ఈదర శ్రీనివాసరావు, దేవరపల్లి భవాని, ఎన్టీఆర్ జగన్, ముప్పనేని రాఘవరావు, దేవిశెట్టి భాస్కర్, వేములపల్లి మల్లికార్జునరావు, ఆరాధ్యుల ఆదినారాయణ, ముళ్లపూడి వెంకట్, నల్లూరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వేధింపులపై కేసు నమోదు

తెనాలిరూరల్: భార్యను వేధిస్తున్న భర్తపై కేసు శుక్రవారం నమోదైంది. పోలీసుల కథనం మేరకు.. పట్టణ చినరావూరుకు చెందిన శ్రీలేఖ తన భర్త శివకుమార్ వేధింపులకు గురిచేస్తున్నాడని పోలీసులను ఆశ్రయించింది. వన్ టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

నేటి నుంచి పశువులకు వ్యాధి నిరోధక టీకాలు

కర్లపాలెం: గాలి కుంటు వ్యాధి నివారణకు శనివారం నుంచి పశువులకు టీకాలు వేయనున్నామని కర్లపాలెం మండల పశు వైద్యాధికారి ఎం.రేచల్ దివ్య శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ఈ నెల 25 నుంచి ఏప్రిల్ 24 వరకు మండల పరిధిలోని అన్ని గ్రామ పంచాయతీల్లో పశు వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి, వ్యాధి నిరోధక టీకాలు వేయనున్నట్లు ఆమె తెలిపారు. రైతులందరూ తమ పశువులకు టీకాలు వేయించాలని పేర్కొన్నారు.

పరీక్ష సామగ్రి పంపిణీ

నగరం: స్థానిక తడవర్తి బాపయ్య స్మారకోన్నత పాఠశాలలో శుక్రవారం పదవ తరగతి విద్యార్థులకు పరీక్ష సామగ్రి కిట్లను పంపిణీ చేశారు. హెచ్ఎం మద్ది సత్యనారయణ మాట్లాడుతూ.. 25 మందికి కిట్లను పంపిణీ చేసినట్లు తెలిపారు. సర్పంచ్ హేమామృతం, వైఎస్సార్ సీపీ నాయకులు ఆనంద్, రాఘవేంద్ర, బాబురావు పాల్గొన్నారు.

టీబీకి మందులున్నాయి.. నివారణ ఉంది



ర్యాలీలో పాల్గొన్న డాక్టర్ సౌభాగ్యవాణి, డాక్టర్ జీవనలత తదితరులు

తెనాలి అర్బన్: క్షయ వ్యాధి పట్ల అందరూ అప్రమతంగా ఉండాలని జిల్లా వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సౌభాగ్యవాణి పేర్కొన్నారు. ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా జిల్లా వైద్యశాల నుంచి శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. టీబీ యూనిట్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జీవన లత మాట్లాడుతూ తెనాలి టీబీ యూనిట్లో ప్రస్తుతం 212 మంది చికిత్స పొందుతున్నట్లు తెలిపారు. వారిలో 15మంది హెచ్ఐవీ, టీబీ మందులు వాడుతున్నట్లు చెప్పారు. క్షయ వ్యాధి మందులు వాడితే తగ్గిపోతుందన్నారు. జిల్లా వైద్యశాలలో క్షయ వ్యాధికి సంబంధించిన పరీక్షలు కూడా ఉచితంగా చేస్తున్నట్లు వివరించారు. సిబ్బందికి ప్రసంశా పత్రాలు అందజేశారు. క్షయ బాధితులకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో నర్సింగ్ సూపరింటెండెంట్ రాజేశ్వరి, ఏఓ డాక్టర్ మజీదా బేగం, ఆర్ఎంఓలు డాక్టర్ షేక్ మస్తాన్‌వలీ, డాక్టర్ సుధీర్, సిబ్బంది పాల్గొన్నారు.

దగ్గేటప్పుడు జాగ్రత్తలు పాటించాలి..

కొల్లిపర: ప్రతి ఒక్కరు దగ్గేటప్పుడు నోటికి గుడ్డ లేదా చేయి అడ్డం పెట్టుకోవాలని లేదంటే నోటి తుంపరల ద్వారా సూక్ష్మక్రిములు ఒకరి నుంచి ఇంకొకరికి చేరి అనేక వ్యాధులు వ్యాప్తి చెందుతాయని మండల వైద్యాధికారి డాక్టర్ చిక్కాల లక్ష్మీ సుధ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని మున్నంగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో క్షయ నివారణ దినోత్సవంలో భాగంగా మనం టీబీని అంతం చేద్దాం అనే కార్యక్రమం నిర్వహించారు. ప్రజలకు టీబీపై అవగాహన కల్పించి, ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ లక్ష్మీ సుధ మాట్లాడారు. టీబీ వ్యాధి ఉన్న వ్యక్తి దగ్గినా, తుమ్మినా నోటి తుంపరల ద్వారా ఒకరి నుంచి మరొకరికి వ్యాప్తి చెందుతుందని తెలిపారు. టీబీ వ్యాధి లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. ఈ కార్యక్రమంలో డాక్టరు వేముల ప్రియాంక, కమ్యూనిటీ హెల్త్ అధికారి దాసర స్వరూప రాణి, తెనాలి ఇన్చార్జ్ అసిస్టెంట్ మలేరియా అధికారి వంగల పున్నారెడ్డి, ఆరోగ్య విస్తరణాధికారి అందెబాల చంద్రమౌళి, వంగర బుజ్జిబాబు, పీహెచ్ఎన్ఎస్ కోటేశ్వరి, ఎల్‌డీ కంప్యూటర్ పఠాన్ ఉందాద్ ఆలీఖాన్ , హెల్త్ అసిస్టెంట్ జి. శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



ప్రశంసా పత్రం అందజేస్తున్న డీఎంఅండ్‌హెచ్ఓ శ్రావణ్‌బాబు

రవికుమార్‌కు ప్రశంసా పత్రం

తెనాలిఅర్బన్: ప్రపంచ టీబీ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని గుంటూరులో శుక్రవారం జరిగిన సమావేశంలో తెనాలి టీబీ యూనిట్ సూపర్ వైజర్ పి.రవికుమార్‌ను ఉత్తమ సూపర్ వైజర్‌గా ఎంపిక చేసి ప్రసంశా పత్రాన్ని అందజేశారు. రవికుమార్‌కు తెనాలి టీబీ యూనిట్ అధికారులు, సిబ్బంది అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో డీఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ ఎ.శ్రావణ్‌బాబు, జిల్లా లెప్రొసీ, ఎయిడ్స్, టీబీ ఆఫీసర్ డాక్టర్ ఆర్.సుబ్బారావు, జీజీహెచ్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ప్రభావతి, జిల్లా టీబీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ బి.లక్ష్మీనాయక్ తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో టీబీపై అవగాహన



టీబీపై ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు, సిబ్బంది



ప్రతిజ్ఞ చేస్తున్న డాక్టర్ దిలీప్, సిబ్బంది

తెనాలిటౌన్: కొలకలూరులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం టీబీ నివారణ దినోత్సవం నిర్వహించారు. పీహెచ్‌సీ వైద్యుడు డాక్టర్ దిలీప్ సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. ఆయన మాట్లాడుతూ టీబీ బాధితులు పూర్తికాలం మందులు వాడినట్లయితే వ్యాధి నుంచి విముక్తి పొందవచ్చన్నారు. రెండు వారాలకు మించి దగ్గు ఉన్నట్లయితే టీబీ కావచ్చని, బరువు తగ్గుతున్నట్లయితే వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఈఓ నాగరాజు, సూపర్‌వైజర్స్ జి.శ్రీనివాసరావు, లక్ష్మీప్రసన్న, పీహెచ్‌సీలోని ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు, హెచ్ఏలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు భక్తి రంజని

తెనాలి: ఉగాది, శ్రీరామ నవమి పర్వదినాల సందర్భంగా తెనాలి రామలింగేశ్వర భక్త సమాజం, తెనాలి ఆంధ్రా ప్యారిస్ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం భక్తి రంజని నిర్వహించనున్నారు. బోసు రోడ్డులోని శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి దేవస్థానం ఆవరణలోని కళావేదికపై సాయంత్రం 6 నుంచి 9 గంటల వరకు భక్తి రంజని ఉంటుందని, చెన్నైకు చెందిన ప్రముఖ శాస్త్రీయ, సినీ సంగీత విద్వాంసుడు, పాడుతా తీయగా, అన్నమయ్య పాటకు పట్టాభిషేకం గాయకుడు సుస్వరం అనిరుధ్ గానం చేస్తారని నిర్వాహకులు తెలిపారు. భక్తి రంజని ఆహ్వాన పత్రికను శుక్రవారం దేవస్థానం ఆవరణలో ఆవిష్కరించారు. విశ్రాంత బ్యాంకు మేనేజరు పరుచూరి సుబ్బారావు, మృదంగం, ఘటం విద్వాంసుడు కానూరు రామకృష్ణ, అన్నమయ్య సంకీర్తన ప్రచారకులు కొండపి శ్రీనివాసరావు, లక్కరాజు లక్ష్మణరావు పాల్గొన్నారు.



ఆహ్వాన పత్రికను ఆవిష్కరించిన నిర్వాహకులు

భక్తిశ్రద్ధలతో పూజించాలి



పూజలు చేస్తున్న ఎంపీ మోపిదేవి, దేవినేని

నగరం: దైవాన్ని భక్తిశ్రద్ధలతో పూజిస్తే సుఖ సంతోషాలతో జీవించవచ్చునని రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు పేర్కొన్నారు. శుక్రవారం ఉల్లిపాలెంలో శ్రీ కొదండరామస్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవంలో ఆయన పాల్గొని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తి భావం పెంపొందించే విధంగా రామ మందిరాలు నిర్మించడం అభినందనీయమన్నారు. గ్రామస్తుల సహకారంతో ఆలయనిర్మాణానికి కృషి చేసిన కమిటీ సభ్యులను ఎంపీ మోపిదేవి అభినందించారు. ఈ కార్యక్రమంలో బాపట్ల అర్బన్ డెవలప్‌మెంట్ ఆథారిటీ ఛైర్మన్ దేవినేని మల్లికార్జునరావు, ఆలయ కమిటీ సభ్యులు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

వేరుశనగ రైతులను ఆదుకోవాలి



కుళ్లి పోయిన వేరుశనగ పైరును చూపుతున్న ఆరేపల్లి రైతులు

చెరుకుపల్లి: అకాల వర్షాలతో వేరుశనగ పంట నష్టపోయిన తమకు నష్టపరిహారం అందించి, ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు. మండలంలోని కుంచలవారిపాలెం, రాంబొట్లపాలెం, తుమ్మలపాలెం, కావూరు, బలుసులపాలెం, ఆరుంబాక, గుళ్లపల్లి పొన్నపల్లి, నడింపల్లి, రాజవోలు పంచాయతీల పరిధిలో 8,008 ఎకరాల్లో వేరుశనగ సాగు చేస్తున్నారు. మండల వ్యవసాయ శాఖాధికారి బాలాజీ గంగాధర్ స్పందిస్తూ.. అకాల వర్షాలకు కొన్ని పల్లపు చేలల్లో, కాలువ పక్కన పొలాల్లో మాత్రమే నీరు నిల్వ ఉండి శనక్కాయ కుళ్లి పోతుందన్నారు. జరిగిన నష్టాన్ని అంచనా వేసి, ఉన్నతాధికారులకు నివేదిక అందిస్తామన్నారు.

అవార్డు గ్రహీతలకు సన్మానం



సిబ్బందిని సన్మానిస్తున్న ఎంపీపీ లలిత కుమారి, జెడ్పీటీసీ ఉదయ భాస్కరి

భట్టిప్రోలు: గ్రామీణ ప్రాంతాల్లో జగనన్న స్వచ్ఛ సంకల్పం కార్యక్రమం సమర్థవంతంగా నిర్వహించి, అవార్డులు అందుకున్న ఆళ్లమూడి, కోనేటిపురం పంచాయతీ సిబ్బందిని శుక్రవారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ దావూరి వెంకట లలితకుమారి, జెడ్పీటీసీ సభ్యురాలు టి.ఉదయభాస్కరి ఘనంగా సన్మానించారు. ఈఓపీఆర్డీ సీహెచ్ శేఖర్, ఆళ్లమూడి సర్పంచ్ పెద్దిశెట్టి రాంబాబు, పంచాయతీ కార్యదర్శులు పి.ప్రదీప్ కుమార్, అడిగోపుల చిన వెంకటేష్‌బాబు, ఇంజినీరింగ్ అసిస్టెంట్ బి.విజయ సారథి, వలంటీర్ వై.ప్రసాద్, క్లాప్ మిత్ర ఎస్.వెంకటేశ్వరరావు సన్మానం అందుకున్నారు. ఎంపీపీ మాట్లాడుతూ ఈ రెండు గ్రామాలను ఆదర్శంగా తీసుకుని మిగతా 13 గ్రామాల పురోగతి చూపాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు నన్నెపాముల చంటి, పార్టీ నాయకులు దావూరి నాగమల్లేశ్వరరావు, టి.బాలాజి, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎర్త్ అవర్ పాటిద్దాం

బాపట్ల అర్బన్ : ప్రపంచం ఎదుర్కొంటున్న అతి పెద్ద సవాలు భూ తాపమని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.మాల్యాద్రి అన్నారు. శుక్రవారం ఫోరం ఫర్ బెటర్ బాపట్ల ఆధ్వర్యంలో ఎర్త్ అవర్ పాటిద్దామనే నినాదంతో ముద్రించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మట్లాడారు. భూ తాపాన్ని నియంత్రించడానికి ఇంధనం, నీటిని పొదుపుగా వాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. శనివారం రాత్రి 8:30 నుంచి 9:30 గంటల వరకు లైట్లు ఆపివేసి, ఎర్త్ అవర్ పాటిద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఫోరం కార్యదర్శి డాక్టర్ పీసీ సాయిబాబు, అధ్యాపకులు అబ్దుల్ కలాం, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇంట్లో చోరీ

తెనాలిరూరల్: తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ జరిగింది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని రజక చెరువు సమీపంలో నివసించే ఓ కుటుంబం పొన్నూరులోని బంధువుల ఇంటికి ఇటీవల వెళ్లింది. తిరిగి శుక్రవారం రాగా తలుపునకు వేసి ఉన్న తాళం తీసి ఉంది. దీంతో వారు పోలీసులను ఆశ్రయించారు. టూ టౌన్ పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఇంట్లో ఉంచిన రూ.20 వేల నగదు, సుమారు రూ.రెండు లక్షలు విలువైన బంగారు ఆభరణాలు, వెండి వస్తువులు అపహరణకు గురైనట్లు గుర్తించారు. కేసు నమోదు చేసిన పోలీసులు, దర్యాప్తు చేస్తున్నారు.

పేదలకు అన్నదానం



అన్నదానం చేస్తున్న గిరిధర్, మల్లీశ్వరి

తెనాలిటౌన్: రైల్వే స్టేషన్ రోడ్డులో గల కానుమాను వెంకట సుబ్బయ్య ధర్మసత్రంలో వెంకట సుబ్బయ్య జయంతి సందర్భంగా శుక్రవారం పేదలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో సత్రం వ్యవస్థాపక కుటుంబ సభ్యుడు కె.గిరిధర్, ఈఓ మల్లీశ్వరి, కె.గోపిచంద్ తదితరులు పాల్గొన్నారు. సుమారు 200 మందికి అన్నదానం చేసినట్లు గిరిధర్ తెలిపారు.

నేడు ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం

వేమూరు: స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రం అభివృద్ధి కమిటీ సమావేశం శనివారం ఉదయం 11 గంటలకు నిర్వహించడం జరుగుతుందని ఆసుపత్రి వైద్యాధికారి మధు సూదనరావు శుక్రవారం ఒక ప్రటకనలో తెలిపారు. ఈ సమావేశానికి రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున హాజరవుతారని, కమిటీ సభ్యులందరూ.. హాజరు కావాలని ఆయన తెలిపారు.

శ్రవణానందంగా ప్రవచనం



ఐలవరం(భట్టిప్రోలు): ఐలవరంలోని శ్రీ సీతారామ మందిరంలో శ్రీమద్రామాయణ సప్తాహ ప్రవచన కార్యక్రమం టీటీడీ, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి గుంటూరు జిల్లా శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు.ఈ కార్యక్రమాలు విశేషంగా భక్తులను ఆకట్టుకుంటున్నాయి. టీటీడీ అయిదు జిల్లాల సూపరింటెండెంట్ ఎం.క్రాంతి కుమార్ ప్రవచనాలు ఆలోచింపజేస్తున్నాయి. స్వామి వార్లకు మహిళలు సామూహిక హారతులిచ్చారు. కార్యక్రమంలో బాపట్ల జిల్లా ధర్మ ప్రచారక్ జంజనం హేమశంకరరావు, డి.సత్యన్నారాయణ, ఎం. రంగారావు, కేవీబీ రమణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా హరిద్ర శృంగార్చన



పిట్టలవానిపాలెం: చందోలు గ్రామంలో వేంచేసిన శ్రీ బగళాముఖి అమ్మవారి దేవాలయంలో శుక్రవారం హరిద్ర శృంగార్చన కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వహణాధికారి జి.నరసింహమూర్తి మాట్లాడుతూ అమ్మవారి దేవాలయంలో ప్రతి శుక్రవారం మగ పిల్లలకు వివాహం జరగాలని ప్రత్యేకంగా పసుపు కొమ్ములతో హరిద్ర శృంగార్చన కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ మోదుగుల ప్రభాకర్‌రెడ్డి, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని, భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు.

ఎంవీఐ చట్ట సవరణలపై అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న న్యాయమూర్తి మాలతి

తెనాలి రూరల్: మోటారు వాహన చట్టంలో సుప్రీం కోర్టు సవరణలపై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, 11వ అదనపు జిల్లా న్యాయమూర్తి జి.మాలతి నూతన చట్ట సవరణల గురించి వివరించారు. సివిల్ అప్పీల్ 9322/2022 కేసులో సుప్రీం కోర్టు మార్గ దర్శకాలు.. రోడ్డు ప్రమాద బాధితులకు, వారి కుటుంబ సభ్యులకు నష్ట పరిహారం త్వరితగతిన అందేలా, కేసుల సత్వర పరిష్కారానికి దోహదపడుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మందలపు వేణుగోపాలరావు, వన్‌టౌన్, త్రీ టౌన్ సీఐలు కె.చంద్రశేఖర్, యు.శ్రీనివాసులు, ఆర్టీసీ డిపో మేనేజర్ రాజశేఖర్, మోటారు వాహన తనిఖీ అధికారి రాఘవరావు, న్యాయవాదులు పాల్గొన్నారు.

స్వచ్ఛ భారత్‌పై అవగాహన ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ప్రసన్నకుమారి, విద్యార్థినులు

తెనాలిటౌన్: కొలకలూరు గ్రామంలో బాపట్ల వ్యవసాయ కళాశాల ఆధ్వర్యంలో జరుగుతున్న జాతీయ సేవా పథకం ప్రత్యేక శిబిరం (ఎన్ఎస్ఎస్) శుక్రవారం రెండో రోజుకు చేరింది. ప్రోగ్రాం ఆఫీసర్ ప్రొఫెసర్ ప్రసన్నకుమారి పర్యవేక్షణలో విద్యార్థినులు గ్రామంలో స్వచ్ఛ భారత్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. స్వచ్ఛ భారత్– ఆరోగ్య భారత్, స్వచ్ఛ భారత్‌కి శ్రీకారం, స్వర్ణ భారత్‌కి మణిహారం అంటూ నినాదాలు చేశారు. గ్రామంలోని మసీదు బజారులో రోడ్లు ఊడ్చి.. శుభ్రం చేశారు. పరిసరాల పరిశుభ్రతపై గ్రామస్తులకు ప్రొఫెసర్ ప్రసన్న కుమారి అవగాహన కల్పించారు. మహిళలకు పెరటి తోట విత్తనాలను ఆమె పంపిణీ చేశారు. కార్యక్రమంలో సచివాలయ సెక్రటరీ జగదీష్, పరిశుభ్రత విభాగం మేస్త్రి గణేష్, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ విద్యార్థులకు 'ఎ' సర్టిఫికెట్లు ప్రదానం



సర్టిఫికెట్లు అందజేస్తున్న హెచ్ఎం సుధారాణి

తెనాలిఅర్బన్: మారీసు పేటలోని ఎన్‌సీఆర్ఎస్ఎం హెచ్ స్కూల్‌లో ఎన్‌సీసీ ట్రూప్ నెంబర్ 13 విద్యార్థులకు ఎన్‌సీసీ 'ఎ' సర్టిఫికెట్లను శుక్రవారం అందజేశారు. ప్రధానోపాధ్యాయురాలు పీవీ సుధారాణి మాట్లాడుతూ ఎన్‌సీసీ సర్టిఫికెట్లు అన్ని పోటీ పరీక్షలకు, ఐఐటీ సీట్ల ఎంపికలో, ఉద్యోగాల రిజర్వేషన్‌లో ఉపయోగపడతాయని తెలిపారు. విద్యార్థులు రక్షణశాఖలో ఉద్యోగాలు పొంది, పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ అధికారి పులి భాస్కరరావు, 8వ ఆంధ్ర ఎన్‌సీసీ విభాగ సిబ్బంది పాల్గొన్నారు.

హెల్త్ కార్డుల పంపిణీ



ఉచిత హెల్త్ కార్డులు పంపిణీ చేస్తున్న మమతాదేవి

తెనాలి: రోటరీ క్లబ్‌లో అనేక సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించిన రాజేంద్రకుమార్ జైన్ జ్ఞాపకార్థం ఉచిత వైద్య పరీక్షలు, సలహాలు ఇచ్చేందుకు శుక్రవారం 500 హెల్త్ కార్డులు పంపిణీ చేశారు. నందులపేటలోని పాత వినాయకుడి గుడి ఆవరణలో నిర్వహించిన సభకు రోటరీ క్లబ్ అసిస్టెంట్ గవర్నర్ గుత్తా వెంకటరత్నం అధ్యక్షత వహించారు. శారద సర్వీస్ సొసైటీ తరపున డాక్టర్ శారద ఈ హెల్త్ కార్డులను రాజేంద్రకుమార్ జైన్ కుటుంబ సభ్యులకు అందజేశారు. వాటిని సామాజిక సేవకులు, పేదలు, రోటరీ క్లబ్ సభ్యులకు పంపిణీ చేశారు. హెల్త్‌కార్డులు అందుకున్న 500 మందికి ఉచితంగా వైద్యపరీక్షలు, సలహాలు ఇస్తామని డాక్టర్ శారద వెల్లడించారు. ఆర్ఎస్ జ్యూవెలరీ అధినేత బాబూలాల్, రాజేంద్రకుమార్ జైన్ సతీమణి మమతాదేవి, చేతన్‌రాజ్ కొఠారి, రాకేష్‌కుమార్ జైన్, డాక్టర్ కె.రామరాజు, పావులూరి రాంబాబు, ఈదర వెంకట పూర్ణచంద్ తదితరులు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ టవర్ పేరుతో.. నగదు స్వాహా

కొల్లూరు: ఓ ప్రముఖ కంపెనీ సెల్‌ఫోన్ టవర్ ఏర్పాటు చేస్తామని, రూ.లక్షల అద్దె ఆశ చూపి ఓ వ్యక్తి నుంచి దఫాల వారీగా నగదు స్వాహా చేసిన ఘటన శుక్రవారం వెలుగులోకి వచ్చింది. అయితే ఈ ఘటనపై బాధితుడు పోలీసులను ఆశ్రయించినా.. కేసు నమోదు చేయకపోవడం విశేషం. వివరాల మేరకు.. మండలంలోని పెదలంకకు చెందిన ఓ వ్యక్తికి గురువారం అపరిచిత వ్యక్తి నుంచి ఫోన్ కాల్ వచ్చింది. ఫోన్ చేసిన వ్యక్తి.. సదరు వ్యక్తి స్థలంలో ఓ ప్రముఖ కంపెనీకి చెందిన సెల్‌ఫోన్ టవర్ నిర్మాణం చేపడతామని, ఏడాదికి రూ.20 లక్షలు అద్దె రూపంలో చెల్లింపులు చేస్తామని నమ్మబలికాడు. ముందస్తుగా ట్యాక్స్ చెల్లింపులు చేపడితే అగ్రిమెంట్ సిద్ధం చేస్తామంటూ.. ఫోన్‌పే రూపంలో శుక్రవారం మధ్యాహ్నం వరకు రూ.47 వేలు పలు ధపాలుగా వసూలు చేశాడు. మరో మారు నగదు చెల్లిస్తే.. ఫైనల్ అగ్రిమెంట్ సిద్ధమవుతుందని, సెల్‌ఫోన్ టవర్ నిర్మాణానికి ఉన్న అడ్డంకులు తొలగిపోతాయని నమ్మించేందుకు ప్రయత్నించాడు. అనేక ధపాలుగా నగదు చెల్లింపులు చేసిన.. బాధిత వ్యక్తికి అనుమానం రావడంతో కొల్లూరులోని ఆ ప్రముఖ సెల్‌ఫోన్ నెట్‌వర్క్ కంపెనీకి చెందిన షోరూంలో సంప్రదించాడు. పైస్థాయి సిబ్బందితో మాట్లాడటంతో సెల్ ఫోన్ టవర్ నిర్మాణం పేరుతో వచ్చిన ఫోన్ కాల్‌కు.. నగదు వసూలుకు ఎటువంటి సంబంధం లేదని సిబ్బంది తేల్చి చెప్పారు. వారి సమాధానంతో మోసపోయానని బాధితుడు గుర్తించాడు. దీంతో కొల్లూరు పోలీసులను ఆశ్రయించానని, తనకు ఫోన్ చేసిన వ్యక్తుల నంబర్లు, ఫోన్ పే చేసిన ఫోన్ నంబర్ వివరాలను అందజేసినట్లు బాధితుడు తెలిపాడు. అయితే నగదు స్వాహా విషయంపై ఎటు వంటి కేసు నమోదు చేయలేదని ఏఎస్ఐ బాబురావు తెలిపారు.